మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి

ఉత్తమ సమాజ నిర్మాణంలో మహిళలు అత్యంత కీలకం

సెల్‌ఫోన్లతో జాగ్రత్త : ఎస్పీ



జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థినులతో ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో మహిళలకు ఇంటా బయటా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందడుగు వేయాలని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు విద్యార్థినులు, పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థినులచే మహిళా సాధికారతను కాంక్షిస్తూ ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించి పోలీసులు ఉపయోగించే ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేటి సమాజంలో సెల్‌ఫోన్ యుగం నడుస్తోందని, నిత్యజీవితంలో మహిళల జీవితాలపై విపరీతమైన ప్రభావం చూపిస్తోందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాల వల్ల జీవితాలు అంధకారమవుతున్నాయని తెలిపారు. బాలికలు సెల్‌ఫోన్ ఉపయోగించడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తియ్యగా మాట్లాడుతూ ప్రలోభాలకు గురిచేసే ఫేస్‌బుక్ పరిచయాలపట్ల అత్యంత జాగ్రత్తగా మెలగాలని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్ కుమార్, ఆదినారాయణ, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, సీఐలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సురేష్, సునీత, నరేందర్‌రెడ్డి, ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్



షీ బాక్స్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న జేఏసీ నేతలు

పుట్టపర్తి టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శుక్రవారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో మహిళా ఉద్యోగుల సమస్యల కోసం షీ బాక్స్ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనేక సమస్యలు, ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తా అన్నారు. షీ బాక్స్ ద్వారా వచ్చిన సమస్యలను గోప్యంగా ఉంచి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జేఏసీ అందించిన షీ బాక్స్‌ను కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగం వద్ద ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ విజయభారతి, ప్రధాన కార్యదర్శి మధునాయక్, జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, కార్యదర్శి సుభాషిణి, ముఖ్యులు రమాదేవి, ప్రభావతి, రుక్మిణీ, అమీనాబాను తదితరులు పాల్గొన్నారు.

శిఖరాగ్రంపై.. ఆమె

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం (6లో)

245 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 245 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. బోటనీ, గణితం, సివిక్స్ పరీక్షలు 9410 విద్యార్థులకుగాను 9202 రాశారన్నారు. 208 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్ష 1151 మందికిగాను 1114 మంది రాశారనీ, 37 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం



రిషిక మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువు

కొత్తచెరువు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అవ్వాతాతతో కలిసి ఆనందంగా పొలం వద్దకు బయల్దేరిన బాలికను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. బైక్ నుంచి ఆనందంగా దిగిన చిన్నారి రెప్పపాటులో రక్తసిక్తమవడంతో అవ్వాతాతల గుండెలు పగిలాయి. వారు రోదించిన తీరు అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది. మండలంలోని బండ్లపల్లి క్రాస్ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద పెనుకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం బొలెరో వాహనం ఢీకొని బాలిక రిషిక (9) దుర్మరణం చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండ్లపల్లికి చెందిన వినోద్ గోపాలమిత్రగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య నాగవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు రిషిక మూడో తరగతి చదువుతుండేది. వినోద్ శుక్రవారం పొలం వద్దకెళ్లాడు. అవ్వాతాతలో కలిసి బైక్‌లో రిషిక కూడా బయల్దేరింది. పొలం వద్ద ద్విచక్రవాహనాన్ని ఆపుతుండగానే.. రిషిక దిగేసి పొలంవైపు పరుగు పెట్టింది. ఇంతలోనే పెనుకొండ వైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయమవడంతో బాలిక అక్కడికక్కడే మరణించింది. వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. బాలిక అవ్వాతాత అరుపులు విన్న తండ్రి వినోద్ పొలం నుంచి పరుగున వచ్చాడు. విషయం తెలుసుకున్న బంధువులు ప్రమాద స్థలానికి పెద్దసంఖ్యలో చేరుకుని, బోరున విలపించారు. దీంతో వాహన రాకపోకలు స్తంభించాయి. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ఆపకుండా వెళ్లిపోయిన వాహనాన్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

సమర్పించుకుంటే చాలు

కీలక పోస్టులలో ఇన్‌చార్జిలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అడ్డగోలు రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వ ఆదాయానికి గండి

పట్టించుకోని ఉన్నతాధికారులు

> రిజిస్ట్రేషన్ల శాఖలో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోంది. కీలకమైన పోస్టులకు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. కొందరు అధికారులు ఇదే అదునుగా అందినకాడికి దోచుకుంటున్నారన్న విమర్శలు వినిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇదంతా తెలిసినా ఉన్నతాధికారులు మిన్నకుండిపోవడంలో అంతరార్థం అంతుబట్టడం లేదు.

పుట్టపర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంలో కీలకమైన రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలతో పాలన సాగుతోంది. ఇటీవల పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలను తుంగలో తొక్కి, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసి అందినకాడికి దండుకుంటున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఓ హోటల్లో కూర్చుని సంతకాలు చేస్తూ మీడియాకు అడ్డంగా దొరికిపోయిన విషయం తెలిసిందే. రిజిస్ట్రేషన్లలో భారీ అక్రమాలకు పాల్పడడంతో చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సీనియర్ సహాయకుడిపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఇలా జిల్లాలో పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వచ్చాయి. అడ్డగోలు రిజిస్ట్రేషన్లతో కొందరిపై సస్పెన్షన్ వేటు పడితే.. మరికొందరు అందినంత దోచుకుని పని చేయలేమంటూ సెలవుపై వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కీలక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించి విధులు నిర్వహించే పరిస్థితి నెలకొంది.

లొసుగులు ఉంటే చాలు..

జిల్లా వ్యాప్తంగా చాలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లలో చిన్నచిన్న లోపాలను అసరాగా చేసుకుని భారీగా దండుకుంటున్నారు. మధ్యవర్తులతో కుమ్మక్కై నిబంధనలు తుంగలో తొక్కుతూ అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. చివరకు చిన్న ప్లాటు అయినా, భవనమైన, నిషేధిత భూములైన సరే సమర్పించుకుంటే చాలు నిబంధనలను పక్కన పెట్టి రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. అదే విధంగా ఆస్తుల విలువ తగ్గించి మాయాజాలం చేస్తున్నారు. స్థలాల్లో ఉన్న నిర్మాణాలను పత్రాల్లో చూపకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే రిజిస్ట్రేషన్ శాఖ లోపభూయిష్టంగా మారింది. ఇటీవల పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వెలుగుచూసిన అక్రమాలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.



కుర్చీలు ఖాళీ

జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. కదిరి, చిలమత్తూరు, పెనుకొండ, తనకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జిలతో కొనసాగిస్తున్నారు. ఇటీవల కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఓ హోటల్ బహిరంగ ప్రదేశంలో డ్యాంకుమెట్లపై సంతకాలు చేసిన వైనం వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్‌ను వెనుకేసుకునేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సంతకాలు చేసింది డాక్యుమెంట్లపైన కాదని వివరణ ఇచ్చుకున్నారు. గత నెలలో సెలవుపై వెళ్లిన సబ్ రిజిస్ట్రార్ విధులకు హాజరుకాలేదు. కదిరిలో రెండు సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఉండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. గోరంట్ల మండలంలో విలువైన ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లో భారీగా అవతకలుకు పాల్పడినట్లు ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై ఉన్నతాధికారులు విచారణ చేసి జనవరి 16న చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ వెంకటనారాయణతోపాటు సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న కుళ్లాయిస్వామిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆటోమొబైల్ హబ్ పెనుకొండలో సబ్‌రిజిస్ట్రార్ వెంకటరాయుడు గత నెలలో మెడికల్ లీవుపై వెళ్లారు. ఇక్కడ కూటమి పార్టీల నేతల ఒత్తిళ్లకు తట్టుకోలేక సెలవుపై వెళ్లినట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. జిల్లాలో కీలకమైన కదిరి, పెనుకొండ, చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లు లేక సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జిలుగా నియమించి పాలన సాగిస్తున్నారు. తనకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్నేళ్లుగా సీనియర్ అసిస్టెంట్‌తోనే కొనసాగిస్తున్నారు. కదిరి, పెనుకొండ, చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు సబ్ రిజిస్ట్రార్లు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ రాజకీయ ఒత్తిళ్లకు తట్టుకోలేకపోతున్నామని ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.



కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎక్కడా ఇబ్బంది లేదు..

జిల్లాలో నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. జనవరిలో చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయడంతో అక్కడ ఇన్‌చార్జిని నియమించాల్సి వచ్చింది. కదిరి, పెనుకొండ సబ్ రిజిస్ట్రార్లు ఇటీవల వ్యక్తిగత, మెడికల్ లీవులపై వెళ్లారు. అందుకే అక్కడ ఇన్‌చార్జిలను నియమించాం. ఖాళీ పడిన సబ్ రిజిస్ట్రార్లను నియమించే అధికారం డీఐజీకి ఉంటుంది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ఎక్కడైన నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే విచారణ చేపట్టి చర్యలు చేపడుతున్నాం.

-కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.62.73 లక్షలు




కదిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హుండీలోని నగదు, కానుకలను శుక్రవారం లెక్కించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 47 రోజులకుగాను రూ.62,73,741 ఆదాయం వచ్చిందన్నారు. 20 గ్రాముల బంగారం, 340 గ్రాముల వెండితో పాటు, 55 అమెరికన్ డాలర్లు కానుకలుగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ అనంత బాబు, బ్యాంక్ సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు, ఆయల సిబ్బంది పాల్గొన్నారు.

కొండలకు నిప్పు



తాడిమర్రి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లి నుంచి చిల్లవారిపల్లి వరకు.. కునుకుంట్ల రామాపురం గ్రామాల సరిహద్దుగా ఉన్న కొండలకు మొత్తం ఆకతాయిలు శుక్రవారం నిప్పుపెట్టారు. దాదాపు ఐదు కిలోమీటర్ల మేర పూర్తిగా కాలిపోయాయి. ఈ కొండల్లో అడవిపందులు, జింకలు, కుందేళ్లు, కొండ ముచ్చులు ఎక్కువగా ఉంటాయి. కొండకు నిప్పుపెట్టడంతో అవన్నీ సజీవదహనమయ్యే ప్రమాదముంది. కొండ పైభాగం నుంచి మొదలైన మంటలు రాత్రి సమయానికి కొండవ దిగువ ప్రాంతలకు చేరుకున్నాయి. దీంతో రైతులు తమ పొలాలకు ఆ మంటలు వ్యాపించకుండా.. నానాయాతన పడుతున్నారు.

ఉష్ణోగ్రతలు



శుక్రవారం

గరిష్ఠం	36.0
కనిష్ఠం	20.0



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.32 శనివారం సాయంత్రం	5.10 ఆదివారం ఉదయం
కదిరి	6.29 శనివారం సాయంత్రం	5.13 ఆదివారం ఉదయం
ధర్మవరం	6.32 శనివారం సాయంత్రం	5.10 ఆదివారం ఉదయం
హిందూపురం	6.33 శనివారం సాయంత్రం	5.17 ఆదివారం ఉదయం
పెనుకొండ	6.32 శనివారం సాయంత్రం	5.17 ఆదివారం ఉదయం

బీసీ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న బీసీ సంక్షేమవసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలోని బీసీ సంక్షేమహాస్టళ్లలో నెలకొన్న సమస్యలను శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని 5 హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలు లేవని, 7 హాస్టళ్లకు ప్రహరీలు లేవని, 12 హాస్టళ్లలో ఆర్వోవాటర్‌ప్లాంట్లు లేవని, మరికొన్నింటిలో మరుగుదొడ్లు, విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సవితను కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.7 కోట్లతో జ్యోతీరావు పూలే బాలకల వసతి గృహం నిర్మాణం చేపట్టారని, రూ.70లక్షలు మాత్రమే విడుదల చేయడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. భవన నిర్మాణానికి ప్రస్తుతం రూ. 3కోట్లు అవసరమవుతాయన్నారు. నిధులు కేటాయించి భవనాన్ని పూర్తి చేయాలని మంత్రి సవితను కోరారు. బీసీ సంక్షేశాఖ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం తరపున ఏమైనా చర్యలు తీసుకుంటారా అని మంత్రిని ప్రశ్నించారు. అనంతరం జిల్లాలోని మహిళలకు ఎమ్మెల్యే అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

సహకార సంఘాల్లో అవినీతిని నిగ్గు తేల్చండి

అసెంబ్లీలో కదిరి ఎమ్మెల్యే కందికుంట



కదిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో జరిగిన అవినీతిపై కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ప్రశ్నించారు. పదేళ్ల కిందట సహకార సంఘాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, దీనిపై విచారణ కూడా కొనసాగిందని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఆ విచారణను ముందుకు తీసుకెళ్లకుండా వదిలేశారని చెప్పారు. ప్రస్తుతం అవినీతి జరిగిన సహకార సంఘాలపై చర్యలు తీసుకుంటారా, లేదా అని ప్రశ్నించారు. కొత్తగా సహకార సంఘాలకు ఎన్నికలని చెబుతున్నారు. మరి ఆలోపు ఈసంఘాలను ప్రక్షాళన చేస్తారా అని ప్రశ్నించారు.



విజయపథంలో మహిళాదీప్తి

అవకాశాలను సృష్టించుకుంటూ, అద్భుతాలు సాధిస్తూ..

స్ఫూర్తి, ప్రేరణ కలిగేలా మగువల జైత్రయాత్ర

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

మారుతున్న కాలానికి తగ్గట్లుగా మగువలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ, అద్భుతాలు సాధిస్తున్నారు. కష్టాలు, నష్టాలను దాటి ప్రగతి మార్గంలో సాగిపోతున్నారు. ఇంటిని చక్కబెడుతూనే సమాజాన్ని సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. లింగ బేధం శరీరానికే కానీ మనసుకు, సాధించాలనే తపనకు కాదని లోకానికి తమ విజయాల ద్వారా చాటి చెబుతున్నారు. వారి ఆకాంక్షలు నెరవేర్చడానికి ఆధునిక ప్రభుత్వాలు చేయూతనిస్తుడటంతో అవనిపైనే కాదు ఆకాశమార్గంలో సైతం పురుషులకు ధీటుగా ఒక్కోసారి మేటిగా రాణిస్తున్నారు. నేడు ప్రపంచ మహిళా దినోత్సవం. ఆ సందర్భంగా గిరి శిఖరం చేరిన కొందరి మహిళల విజయగాథలు వారి మాటల్లోనే...

పది మందికి ఉపాధి కల్పించాలని..



నాగలక్ష్మి

నేను చదువుకుంది పదోతరగతే. అయినా పది మందికి ఉపాధి కల్పించాలన్నదే నా కోరిక. ఆదిశగా ప్రయత్నం చేశా. ఆ క్రమంలోనే పదేళ్ల కిందట నుంచి రంగు రంగుల ప్లాస్టిక్ పూలహారాలు తయారుచేసి విక్రయించడం ప్రారంభించా. దీని ద్వారా అప్పట్లో 5నుంచి 10మందికి మాత్రమే ఉపాధి కల్పించేది. కాని ఐదేళ్ల కిందట రబ్బర్, ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి, వస్త్రంతో పూలహారాలలను తయారు చేయడం ప్రారంభించా. దీంతో వ్యాపారం లావాదేవీలు పెరిగాయి. దీంతో వివిధ మార్గాల ద్వారా డబ్బు సమకూర్చుకుని అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేసుకుని పూలహారాలు తయారు చేయడం ప్రారంభించాం. ఈ నేపథ్యంలో సుమారు 300మంది దాకా ఉపాధి కల్పించగలిగా. మేము తయారు చేసే డెకరేషన్ పూలహారాలు ఆంధ్రతోపాటు తెలంగాణ, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్‌గా విక్రయిస్తాం. సుమారు వంద రకాల హారాలను తయారు చేస్తాం. మేము రూ.40నుంచి రూ.5వేల దాకా విలువ గల హారాలను తయారు చేస్తున్నాం. ఏడాదికి రూ.3కోట్ల దాకా టర్నోవర్ ఉంటోంది. మేము తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల నుంచి అవసరమైన వస్త్రం తెప్పిస్తున్నాం. మరికొంత ముడిసరుకు తీసుకొస్తున్నాం. త్వరలో ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు ప్రారంభిస్తాం. రాష్ట్రంలో వంద వంది మహిళా వ్యాపారవేత్తలను ప్రభుత్వం ఎంపిక చేయగా అందులో నాకు స్థానం దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకుంటా.

-నాగలక్ష్మి, పూలహారాల తయారీ ఫ్యాక్టరీ యజమాని



మహిళలు వస్త్రంతో తయారు చేసిన పూల హారాలు

విన్సెంట్ ఫెర్రర్ ప్రేరణతో..



విన్సెంట్‌ఫెర్రర్‌ను కలవడం నా జీవితంలో గొప్ప మలుపు తీసుకుంది. 1972లో అనంతపురంలోని ఆర్డీటీని సందర్శించా. అక్కడ ఫెర్రర్‌తో మాట్లాడిన తర్వాత నాలో ఓ ప్రేరణ కలిగింది. సామాజిక సేవపై ఆసక్తి ఏర్పడింది. ఈక్రమంలోనే దాదాపు 12ఏళ్ల పాటు వివిధ సంస్థలతో పాటు జిల్లాలోని యంగ్‌ఇండియా సంస్థలో కూడా పని చేశా. మాది కేరళ రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లా. నేను సోషల్ వర్క్‌లో పీజీ చేశా. సామాజిక సేవపై అభిలాషతో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరికి చెన్నేకొత్తపల్లి మండలంలో స్థిరపడ్డా. ఆ మండలంలోని కరువు పరిస్థితులు, మహిళలు, రైతుల స్థితిగతులను గమనించా. వారిలో మార్పు తీసుకురావడానికి 1990లో టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛందసంస్థను నెలకొల్పా. సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణ, మహిళాసాధికారత, సుస్థిర వ్యవసాయం, విద్య, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం సంస్థ ద్వారా చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్దం, పెనుకొండ తదితర మండలాల్లో సొసైటీలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం 34 వేల మంది మహిళలతో రూ.65కోట్ల టర్నోవర్‌తో అది మహాశక్తిగా నడిస్తోంది. మహిళలు ఎంచుకున్న రంగంలో దృఢ సంకల్పంతో ముందుకు సాగితే తప్పక విజయం సాధిస్తారు.

- మేరీ వటమట్టం, టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకురాలు

శిఖరాగ్రంపై ఆమె



ఉన్నత చదువులే తోడు.. నీడ (సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినులు)

ఇంటి నుంచే మార్పు



మహిళల మార్పు ఇంటి నుంచే మొదలుపెట్టాలి. తనపిల్లలను లింగవివక్షలేకుండా మంచి క్రమశిక్షణతో పెంచాలి. మంచి చదువు, సంస్కారం నేర్పాలి. సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలి. ఇళ్లే ప్రథమపాఠశాల కాబట్టి పిల్లలకు చిన్నతనం నుంచే పెద్దలపట్ల గౌరవభావం పెంపొందేలా తీర్చితిద్దాలి. బాలికల అభిరుచిని గమనించి వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి. సమాజంపట్ల బాధ్యతను చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇదంతా తల్లి వల్లే సాధ్యం అవుతుంది.

- డాక్టర్ ఫైరోజ్‌బేగం, డీఎంహెచ్ఓ, శ్రీసత్యసాయి జిల్లా

సంఘాలతో మహిళా సాధికారత



స్వయం సహాయక సంఘాలతో మహిళా సాధికార సాధ్యమవు తుంది. వీటి ద్వారా మహిళకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతోంది. డ్వాక్రా సంఘాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు. డ్వాక్రా సంఘాలు వచ్చిన తరువాతే మహిళల్లో చదువు, సమాజం పట్ల అవగాహన పెరిగింది. ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి, జీవనోపాధులు పెంపొందించుకోవడానికి, ఆత్మ విశ్వాసానికి సంఘాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

- సుశీల, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు

చైతన్యం పెరిగింది



డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేరడంతో మహిళల్లో చైతన్యం పెరిగింది. సమాజంలో లింగబేధం లేకుండా పురుషులు, మహిళలు అందరూ సమానమేననే భావన ప్రజల్లో మొదలైంది. డ్వాక్రా సంఘాలతోనే మూఢనమ్మకాలు, దాడులను నియంత్రించే స్థాయికి మహిళలు వచ్చారు. ఇదంతా కేవలం డ్వాక్రా సంఘాలతోనే సాధ్యమైంది. ఎస్‌హెచ్‌జీ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు, ఉన్నతి కింద జీవనోపాధుల పెంపునకు రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలు స్వయం ఉపాధిని పొందుతున్నారు

- రాధమ్మ, ప్రశాంతి సమాఖ్య జిల్లా కార్యదర్శి

50 శాతం సీట్లు కేటాయించాలి

తనకల్లు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళలకు 50శాతం సీట్లు కేటాయించాలి. నన్ను చిన్నప్పటినుంచి మా తల్లిదండ్రులు ఎలాంటి వివక్ష లేకుండా పెంచారు. వారి ప్రోత్సాహంతోనే ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగం సాధించా. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, సంఘసంస్కర్తలు, ప్రభుత్వాలు మహిళ చైతన్యం కోసం పనిచేస్తున్నా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొన్నిచోట్ల మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది. అది పూర్తిగా రూపుమాపాలి.

- ఎస్ లలితమ్మ, ఎంఈఓ, తనకల్లు



విరామం తర్వాత గెలుపుతో స్ఫూర్తి: ప్రభావతి, యోగా శిక్షకురాలు

పెళ్లై పిల్లలు కలిగినా జీవితంలో ఏదో తెలియని వెలితి. ఏదో సాధించాలన్న తపన. ఇవే నన్ను యోగా వైపు నడిపించాయి. చిన్నప్పటి నుంచి నాకు ఆటలంటే ఎంతో ఇష్టం. ఈక్రమంలోనే రన్నింగ్, త్రోబాల్, వాలీబాల్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రోలలో ఎన్నో బహుమతులు సాధించా. 800 మీటర్ల హర్డిల్స్‌లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని అందుకున్నా. ఇలా నా ఆటలు డిగ్రీ వరకూ సాగాయి. ఆపై స్తోమతలేక మా నాన్న నన్ను చదివించలేకపోయారు. దీంతో ఉన్నత చదువులు, క్రీడలు రెండింటికి దూరమయ్యా. ఇదంతా 1995 నాటి మాట. పెళ్లైన తర్వాత ముదిగుబ్బలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా చేరా. 2014లో మా పాఠశాల డైరెక్టర్ హెల్గా శాంతి పుట్టపర్తిలో యోగా తరగతులు నిర్వహించారు. వాటికి హాజరయ్యాక యోగాపై ఆసక్తి కలిగింది. అందులో ప్రావీణ్యం సాధించాలనే పట్టుదల కలిగింది. యోగా సాధన మొదలుపెట్టా. ఆపై తమిళనాడులోని మధురై శివానంద యూనివర్సిటీలో ఏడాది పాటు యోగలో ప్రత్యేక శిక్షణ చేశా. యోగాలో కఠినమైన సూత్రనేతి, జలనేతి వంటి ఆసనాలపై శిక్షణ తీసుకొని, జల, వాయు, ప్రెగ్నెన్సీ, పిల్లల కోసం ఇలా రకరకాల అంశాల్లో మెలకువలు నేర్చుకున్నా, తరువాత ఎంఎస్సీ(యోగా) పూర్తి చేశా. ఆ తర్వాత ముదిగుబ్బలోనే ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా చేరా. విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తూనే, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఎన్నో పతకాలు గెలుచుకున్నా. విరామం అనంతరం వచ్చిన గెలుపు కదా.. మరిన్ని విజయాలు సాధించే స్ఫూర్తినిచ్చింది.



యోగాలో గెలుపొందిన పతకాలను చూపుతున్న ప్రభావతి

బోధించే అవకాశం రావడం ఆనందంగా ఉంది..

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతితో ఇంటర్వ్యూ



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ)గా పనిచేస్తున్న తనను బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా నియమించడం ఆనందంగా ఉందంటున్నారు సుమన జయంతి. బోధన తనకు ఇష్టమనీ, డీఎల్‌పీఓగా ఉంటే ఆ అవకాశం దక్కేది కాదన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు నియమించాక సబ్జెక్టు బోధించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందని చెబుతున్న ఆమెతో ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: పీఆర్ నుంచి బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చాక ఎలా ఉంది..?

జవాబు: పంచాయతీరాజ్ నుంచి బీసీ స్టడీ సర్కిల్‌కు రావడం ఆనందంగా ఉంది. ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. నాకు ముందు నుంచీ టీచింగ్ అంటే ఇష్టం. బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్‌లను పర్యవేక్షించడం, అవసరమైనపుడల్లా సబ్జెక్టు బోధించే అవకాశం లభించినట్లయింది.

ప్రశ్న: స్టడీ సర్కిల్‌లో వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు : బీసీ స్టడీ సర్కిల్ భవనం అక్కడక్కడా దెబ్బతింది. వసతుల కల్పన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. ఇప్పటికే పలు అంశాలను అధికారులకు వివరించా.

ప్రశ్న: కోచింగ్‌కు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి వసతులు కల్పించాలనుకుంటున్నారు?

జవాబు: స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణకు వచ్చే అభ్యర్థులకు వసతుల కల్పన విషయంలో నిబంధనలు పాటిస్తాం. మెరుగైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: డీఎస్సీ మెటీరియల్ ఇవ్వకపోడంతో ఇబ్బందులు పడుతున్నారు.. ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: డీఎస్సీ మెటీరియల్ గతంలో ఇచ్చేవారని తెలిసింది. ప్రస్తుతం స్టైఫండ్‌తో పాటు మెటీరియల్‌కు సంబంధించి రూ.1000 జమ చేస్తారు. మెటీరియల్ పంపిణీ విషయాన్ని రాష్ట్ర అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఉచిత శిక్షణలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రాబోయే కాలంలో మొదలయ్యే అన్ని రకాల శిక్షణలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకుంటున్నాం. ఉదయం 7.30 గంటల నుంచి కోచింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. తద్వారా విద్యార్థులకు మరింత సమయం కేటాయించినట్లవుతుంది.

ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం మేరకు ఫలాలు అందాలి

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు కృషి

సమీక్షలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన ఫలాలను అందించడానికి అధికారులు కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అందరూ పనిచేయాలని సూచించారు. జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి భూములు లేని నిరుపేద కుటుంబాలకు భూమి ఇవ్వాలన్నారు. ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి కృషిచేస్తానని తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేసి నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన వివిధ కేసులలో బాధితులకు రూ.58 లక్షలు పరిహారం వచ్చిందని తెలిపారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడానికి పోలీస్ యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. విజిలెన్స్ కమిటీ సూచించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, సోషల్ వెల్ఫేర్ డీడీ రాధికా, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బీసీఆర్ దాస్, యల్లన్న, చిరంజీవి, ఇమామ్, రామన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా, కలెక్టరు,ఎస్పీ

గ్రేడ్-3 ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులపై కదలిక

210 మంది సీనియార్టీ జాబితా విడుదల

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించడం కోసం జిల్లా వైద్యశాఖ అడుగులు వేస్తోంది. ప్రభుత్వం ఆదేశించినా గత ఆరునెలలుగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పదోన్నతులపై వైద్యశాఖ నిర్లక్ష్యం' అంటూ కథనం ప్రచురితమయింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి పదోన్నతులు కల్పించడానికి సిద్ధమయ్యారు. ఉమ్మడి అనంత జిల్లాలో 1017 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 215 ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టులు ఖాళీలుగా చూపారు. ఇందులో సత్యసాయి జిల్లాలో 111 ఉండగా అనంత జిల్లాలో 114 ఉన్నాయి. ఐదు కోర్టు కేసులు ఉండడంతో వాటిని పక్కన పెట్టారు. మిగిలిన 210 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. ఆ మేరకు అర్హతగల సీనియార్టీ జాబితాను తయారు చేసి వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. ఈనెల 10లోగా పీహెచ్, వితంతువు, అంధులు తదితర ప్రిఫరెన్సియల్ ఉన్నవారు సర్టిఫికెట్లను సమర్పించాలని తెలిపారు. వాటిని పరిశీలించి అందులో అర్హత ఉంటే పదోన్నతుల కౌన్సిలింగ్‌లో ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. ఈనెల 15వ తేదీలోగా పదోన్నతుల ప్రక్రియ ముగిస్తామని అన్నారు.

ఎన్నికల కేసులపై చార్జిషీట్ వేయండి

ఎస్పీకి సూచించిన కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల అనంతరం జిల్లాలో చోటు చేసుకున్న అల్లర్లు, హింసకు సంబంధించిన కేసులపై వెంటనే చార్జిషీట్ వేయాలని ఎస్పీ జగదీష్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం జరిగిన హింస చాలా సున్నితమైన అంశం అన్నారు. హింసకు సంబంధించిన కేసులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తాడిపత్రిలో ఏడు కేసులు నమోదు కాగా అందులో ఐదు కేసులకు సంబంధించి చార్జిషీట్ వేశామని, ఒకటి తప్పుడు కేసుగా తేల్చగా, మరో కేసుపై విచారణ కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేయడంలో పోలీస్‌శాఖకు సంపూర్ణసహకారం అందించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. ఎన్నికల అల్లర్లకు చెందిన కేసులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్ని కేసులకు వెంటనే చార్జిషీట్స్ వేయాలని ఆయా పరిధిలోని కిందిస్థాయి పోలీసు అధికారులను ఆదేశించారు.

11న పెనుకొండలో జాబ్‌మేళా

పెనుకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో ఈనెల 11న కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణఓ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ పూర్తిచేసి 18-33 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.13వేల నుంచి రూ.18వేల దాకా జీతం ఉంటుందన్నారు. ఎంపికైన వారు పాలసముద్రం, పెనుకొండ, హిందూపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని 11న ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాలన్నారు. ఇతర వివరాలకు 9676706976కు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్‌ను సంప్రదించాలన్నారు.

ఆవుకు కృతిమ కాలు ఏర్పాటు



ఆవుకు అమర్చిన కృతిమ కాలుతో లింబ సెంటర్ సిబ్బంది

గుంతకల్లు టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలోని గోశాలలో ఓ ఆవుకు కృతిమ కాలును శుక్రవారం అమర్చారు. బళ్లారిలోని శ్రీ షిరిడి సాయి సేవా సత్సంగ్ సహకారంతో హుబ్లీకి చెందిన మహావీర్ లింబ సెంటర్ సిబ్బంది ఆవుకు కృతిమ కాలును అమర్చారు. కార్యక్రమంలో శ్రీ షిరిడీ సాయిసేవా సత్సంగ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

యాడికి, మార్చి7(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనివ్వలేదని గంజి మహేంద్ర (16) విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం మండలంలోని నిట్టూరు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు నిట్టూరు గ్రామానికి చెందిన మహేంద్ర తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లి మీనాక్షిని అడుగుతుండేవాడు. ఇప్పుడు నీకు సెల్‌ఫోన్ ఎందుకు అని తల్లి మందలించింది. సెల్‌ఫోన్ అడిగినా కొనివ్వలేదని మనస్తాపంతో మహేంద్ర విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు.

ప్రేరణ సఖిగా జ్యోతమ్మ

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మెప్మా పరిధిలోని సాయినగర్ శారదాంబ మహిళా పొదుపు సంఘం సభ్యురాలు జ్యోతమ్మ.. ప్రేరణ సఖి అవార్డుకు ఎంపికయ్యారని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జ్యోతమ్మ తోలుబొమ్మల తయారీ రంగంలో, పారిశ్రామిక వేత్తగా రాణిస్తున్నారు. దీంతో ఆమె.. ప్రేరణ సఖిగా ఎంపికైందన్నారు. పుట్టపర్తిలో శనివారం నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

పోలీసు స్టేషన్లకు సెట్-2 ప్రశ్నాపత్రాలు

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చేరిన పదో తరగతి సెట్-2 ప్రశ్నాపత్రాలను వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు(సెట్-2) ప్రత్యేక వాహనంలో చేరాయి. వాటిని పోలీసు స్టేషన్లలో భద్రపరిచారు.

135 అభ్యంతరాలు...

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై శుక్రవారం 135 అభ్యంతరాలు వచ్చాయి. సైన్స్ సెంటర్‌కు టీచర్లు రోజురోజుకీ క్యూ కడుతున్నారు. ఇప్పటి వరకూ అభ్యంతరాల సంఖ్య 361కి చేరింది.

హంద్రీనీవాను వెడల్పు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలువను వెడల్పు చేయడంతోపాటు పంట కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని రైతులు కోరుతుంటే లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవడం సరికాదన్నారు. హంద్రీనీవాను వెడల్పు చేయకుండా అత్యంత వెనుకబడిన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. సీమ అభివృద్ధికి సాగు నీటి వనరుల అభివృద్ధి కీలకమన్నారు. అనేక పోరాటాల ఫలితంగానే హంద్రీనీవాకు నీరు వచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులు చేస్తామని టెండర్లు పిలిచారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 6300 క్యూసెక్కులకంటే ఎక్కువ నీరు తెస్తామని ఎన్నికల ముందు చెప్పారన్నారు. ప్రస్తుతం ఖరారు చేసిన టెండర్లలో 3850 క్యూసెక్కులకే పరిమితం చేయడం, రెండో దశ కాలువ లైనింగ్ పనులకు సిద్ధమవడం ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఉందని విమర్శించారు. లైనింగ్ పనులను రాప్తాడు ఎమ్మెల్యే కూడా వ్యతిరేకిస్తున్నందున మిగిలిన ఎమ్మెల్యేలు వారి వైఖరులను ప్రకటించాలన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రితో సానుకూల నిర్ణయం ప్రకటింపజేయాలని కోరారు.

మరో ఇద్దరికి ఏఓలుగా ఉద్యోగోన్నతి


ఉత్తర్వులు అందుకుంటున్న చంద్రశేఖర్

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో మరో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏఓ)గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవలి వరకూ నాలుగు ఏఓ పోస్టులు ఖాళీగా ఉండేవి. రెండ్రోజుల క్రితం ముగ్గురికి ఉద్యోగోన్నతి ఇచ్చి, భర్తీ చేశారు. అందులో ఒకరు తనకు ఏఓ ఉద్యోగోన్నతి వద్దని... లిఖితపూర్వకంగా రాసి అధికారులకు ఇవ్వడంతో ఆ పోస్టు ఖాళీ పడింది. అప్పటికే ఖాళీ ఉన్న మరొకటి కలిపి రెండు పోస్టులకు ప్యానల్ సీనియారిటీ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌కు ప్రమోషన్ ఇస్తూ... నంబులపూలకుంట మండల పరిషత్ కార్యాలయానికి నియమించారు. మరో సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్‌కు సైతం ప్రమోషన్ ఇస్తూ అగళి మండల పరిషత్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. కొత్తగా ప్రమోషన్ పొందిన ఏఓలకు జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో
ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష

అనంతపురం క్రైం, మార్చి7(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయి రమావత్ డాక్యా నాయక్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. 2019 మే 17వ తేదీన వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన డాక్యానాయక్ పదేళ్ల బాలికను అపహరించాడు. పొలంలోని చింతచెట్టు వద్దకు ఎత్తుకెళ్లి, తన పంచెతో బాలిక కాళ్లు, చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి వజ్రకరూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. అప్పటి గుంతకల్లు డీఎస్పీ ఖాసీంసాబ్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి 14 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో శుక్రవారం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ జగదీస్ అభినందించారు.

ప్రవేశ పరీక్ష కేంద్రాల పెంపు

మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల కన్వీనర్ జోనాథన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తులు వస్తుండడంలో ఏడు పరీక్షా కేంద్రాలను పెంచుతున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనాథన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, పెంచిన పరీక్షా కేంద్రాలను విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

పెంచిన పరీక్ష కేంద్రాలు..

కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం, అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న శింగనమల ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసత గృహం, అనంతపురంలోని బాయ్స్ జూనియర్ కళాశాలలోని ఉన్న బీసీ నార్పల బాలుర కళాశాల వసతిగృహం, అనంతపురం హౌసింగ్‌బోర్డు మెయిన్ రోడ్డులో ఉన్న నార్పల బీసీ కళాశాల బాలికల వసతి గృహం, రాయదుర్గంలోని బీసీ బాలుర వసతిగృహం, అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రి వెనుకవైపు ఉన్న బీసీ బాలికల కళాశాల వసతిగృహం, ధర్మవరంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాలు పెంచిన పరీక్షా కేంద్రాల జాబితాలో ఉన్నాయి.

మట్టే కదా..!

- జిల్లాలో చెలరేగిన మట్టి మాఫియా
- కొండలు పిండి.. చెరువులు ఖాళీ..
- సొమ్ము చేసుకుంటున్న స్వార్థపరులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు, మైన్స్, ఇరిగేషన్ శాఖలు


దేవరపల్లిలోని కొండను తవ్వేసిన మట్టి మాఫియా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రోడ్లకు, పొలాలకు ఇష్టానుసారంగా మట్టిని తరలించేస్తున్నారు. ఇటీవల ఇప్పేరులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్లను మైన్స్ అధికారులు అలా పట్టుకుని ఇలా వదిలేశారు. పామిడి మండలం దేవరపల్లి కొండల్లో, గార్లదిన్నె మండలం జంబులదిన్నె చెరువులలో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పగటి పూట రైతుల పంట పొలాల పేరుతో మట్టిని తరలిస్తున్న మాఫియా...రాత్రి పూట అసలు దందా చేస్తోంది. ఇంత మట్టి దోపిడీ జరుగుతున్నా మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ పోలీసు శాఖ అధికారులు తమకేమి సంబంధం లేదన్నట్లు ప్రేక్షకపాత్రలో మిన్నకుండిపోతున్నారు. ఆయా శాఖల మధ్య సమన్వయలోపమే మట్టి మాఫియా ఆగడాలకు కారణమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇప్పటికే పలు ఫిర్యాదులు వెళ్లినా వాటిని బుట్టదాఖలు చేస్తున్నట్లు సమాచారం.

దేవరపల్లి కొండ, ఇప్పేరు చెరువు మట్టి తరలింపు

పామిడి మండలం దేవరపల్లి వద్ద ఉన్న ఓ కొండను పిండి చేసేశారు. టిప్పర్ రూ.5వేలు చొప్పున రోజుకు 50 టిప్పర్లు తోలేస్తున్నారు. కొన్నిరోజులు పగలు, మరికొన్ని రోజులు రాత్రి పూట మట్టిని తోడేస్తున్నారు. కూడేరు మండలం ఇప్పేరు చెరువులో పొట్టిచెరువు గ్రామానికి చెందిన ఓ చోటా నాయకుడు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో మైన్స్ అధికారులు ఇటీవల దాడి చేసి ఎక్స్‌కవేటర్, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. నామమాత్రపు జరిమానాతో ఆ వాహనాలను వదిలేశారు. తిరిగి ఆ చోట నాయకుడు ఇప్పేరు చెరువు నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తోలుతున్నాడు. ఇవి ఉదాహరణలు మాత్రమే. జిల్లాలో చాలా చోట్ల ఇదే తంతు సాగుతోంది. కమర్షియల్ వాడకానికి 500క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు అనుమతి ఇస్తారు. రూ. 65వేలు చెల్లించి మట్టిని తరలించాలి. ఇది అధికారికంగా ప్రభుత్వం చెరువులో మట్టికి నిర్ణయించిన ధర అయినప్పటికీ దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు.

మట్టిమాఫియాకు అధికారులు అండ

జిల్లాలో మట్టిమాఫియా ఆగడాలకు సంబంధిత శాఖల అధికారులే అండగా నిలుస్తుండటం గమనార్హం. మట్టి మాఫియాతో మైనర్ ఇరిగేషన్, భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసులు కుమ్మక్కై ఇష్టారీతిలో మట్టిని తరలించేందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 301 చెరువులు ఉన్నాయి. ఇందుకు ప్రధానంగా మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ముడుపులు పుచ్చుకుని వంత పాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పామిడి మండలం దేవరపల్లి కొండలు, గుట్టలు, కూడేరు మండలం ఇప్పేరు, గార్లదిన్నె మండలం జంబులదిన్నె చెరువులలో అక్రమంగా మట్టిని తరలించిన ఉదంతాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.


టిప్పర్‌లోకి మట్టిని నింపుతున్న ఎక్స్‌కవేటర్

చర్యలు తీసుకుంటాం



కొండలు, చెరువుల్లో మట్టిని తరలించినట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పేరు, పామిడి మండలాల నుంచి పలు ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై నిఘా ఉంచాం. ఇటీవల పొట్టిచెరువుకు చెందిన ఎక్స్‌కవేటర్, టిప్పర్లను సీజ్ చేశాం. చెరువుల్లో మట్టిని తరలించేందుకు మైనర్ ఇరిగేషన్, మైన్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతి ఉండాలి. కమర్షియల్, ఇతర వాటికి ఫీజు వసూలు చేస్తారు. రైతులకు మాత్రమే ఉచితంగా మట్టిని తరలించుకునే వెసులుబాటు ఉంది. అనుమతికి మించిన మట్టిని తరలించినట్లు తేలితే ఉన్నతాధికారులకు విచారణ నివేదిక అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

\- వెంకటేశ్వర్లు, జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి

హోలీకి ప్రత్యేక రైలు

గుంతకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ నియంత్రణకు గుంతకల్లు మీదుగా బెంగళూరు-కలబురగి మధ్య ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి (నంబర్ 06519) ప్రత్యేక రైలు ఈ నెల 13, 14 తేదీల్లో రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 06520) ఈ నెల 14, 15 తేదీల్లో కలబుగిలో ఉదయం 9-35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా వెళుతుందని తెలియజేశారు.

రేపు విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

అనంతపురంరూరల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా సమావేశం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యూసుఫ్ తెలిపారు. ఆమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో ఉద యం 10.30గంటలకు సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సెలవు రోజుల్లోనూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాపై సెలవు రోజుల్లోనూ అభ్యంతరాలను స్వీకరిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం, ఆదివారం సెలవు దినాలైనా అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ మునిసిపల్, జిల్లాపరిషత్, మండలపరిషత్ యాజమానాల్లో పనిచే సే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు జా బితాపై అభ్యంతరాలుంటే చెప్పవచ్చునన్నారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సా యంత్రం 5 గంటల వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామని డీఈఓ పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.8



అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తా డు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.2,600, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 571 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

దానిమ్మ రైతుకు పరిహారం చెల్లించండి

వ్యవసాయ శాఖకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతుకు పరిహారం చెల్లింపు విషయంలో వ్యవసాయ శాఖాధికారులకు జిల్లా వినియోగదారుల ఫోరంలో మొట్టికాయ వేసింది. బాధిత రైతుకు పంట నష్టం పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనీ, వెంటనే చెల్లించాలని ఆదేశించింది. గుమ్మఘట్ట మండలం గోల్లపల్లికి చెందిన రైతు గౌని రాఘవేంద్ర రెడ్డి 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయాడు. అతడికి ప్రభుత్వం ప్రకటించిన పంట బీమా పరిహారంగా రూ.2.61 లక్షలు, రైతు అనుభవించిన మనోవేదనకుగాను మరో రూ.50వేలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రైతు గౌని రాఘవేంద్రరెడ్డి 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయాడు. పంట బీమా జాబితాలో తన పేరున్నా పరిహారం ఎందుకు చెల్లించలేదని అధికారులను సంప్రదించారు. 2022లో స్పందన ద్వారా అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా పంట బీమా పరిహారం మాత్రం అందలేదు. చివరికి 2023లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. వ్యవసాయ అధికారులు, ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేశారు. రైతు తన పంట బీమా వివరాలను వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయలేదనీ, అందుకే పరిహారం అందలేదని అధికారులు వాదించారు. అదే భూమిలో ముందుగా గౌని సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి పంట బీమా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2021లోనే అదే భూమిలో భూసార పరీక్ష ఆధారంగా వేరే పంటకు బీమా పరిహారం చెల్లించామని తమ నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు. రైతు తన పంట బీమా నమోదు పూర్తి చేసి, అనేకసార్లు అధికారులను కలిశాడనీ, తగిన చర్యలు తీసుకోలేదని కమిషన్ గుర్తించింది. దానిమ్మ పంటకు బీమా పరిహారం అందిన రైతుల జాబితాలో అతని పేరు ఉన్నా.. పరిహారం ఇవ్వకపోవడానికి తెలిపిన కారణాలు సబబుగా లేవని పేర్కొంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు తీవ్ర ఆర్థిక నష్టం చవిచూశాడని స్పష్టం చేసింది. ప్రతిపాదించిన ఎకరాకు రూ.33,600 పరిహారం హక్కుగా ఉందనీ, మొత్తం 7.78 ఎకరాలకు రూ.2.61 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. రైతు పంట బీమా కోసం చేసిన ప్రయత్నంలో అనుభవించిన మానసిక వేదనను కమిషన్ గుర్తించిందని అందుకు పరిహారంగా మరో రూ.50వేలు వ్యవసాయ శాఖ అధికారులు చెల్లించాలని పేర్కొంది. ఈ మొత్తం 45 రోజుల్లో చెల్లించకపోతే 9శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, మెంబర్ డి గ్రేస్ మేరీతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

రాక్రీట్ అవినీతిని తేల్చండి

తోపు కాజేసిన సొమ్ము రికవరీ చేయండి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


అసెంబ్లీలో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ అవినీతిని నిగ్గు తేల్చాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంస్థ అవినీతిలో భాగస్వాములైన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అక్రమాలపై విజిలెన్స్ విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని అన్నారు. తాను తోపునని చెప్పుకునే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. రాక్రీట్ సంస్థ పేరుతో చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావని అన్నారు. ఆ సంస్థ ద్వారా 50 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఇసుక, సిమెంట్, ఇనుము ఇతర వాటిలో వందల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వైఎస్సార్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లో గృహ నిర్మాణపనుల్లో అనేక అక్రమాలు జరిగాయని అన్నారు. వేల సంఖ్యలో ఇళ్లు నిర్మించామని గొప్పలు చెబుతున్న ఈ తోపు సంస్థ నిర్మించింది వందల సంఖ్యల్లోనే అని అన్నారు. రాక్రీట్ సంస్థ అవినీతిని గమనించి వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థ నిర్మిస్తున్న 13 వేల ఇళ్లను రద్దు చేసిందని అన్నారు. పునాది నిర్మించాక ఒక్కో ఇంటికి మొదటి విడతగా రూ.60 వేలు చెల్లించాలనే విషయాన్ని పక్కనబెట్టి, ఇళ్లు పూర్తయినట్లు అధికారులు కాగితాల్లో చూపించి రూ.కోట్లల్లో బిల్లులు చెల్లించారని అన్నారు. కొన్ని చోట్ల ఇళ్లు నిర్మించకుండా బిల్లులు కాజేశారని, ఒకే పేరుతో పదుల సంఖ్యలో ఇళ్లు తీసుకున్నారని అన్నారు. దీనిపై తాము ముఖ్యమంత్రి చంద్రబాబుకు, గృహ నిర్మాణ శాఖ మంత్రికి ఆధారాలతో ఫిర్యాదు చేశామని, కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిందని అన్నారు. విజిలెన్స్ విచారణను త్వరగా పూర్తి చేయించి, రాక్రీట్ సంస్థ కాజేసిన మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ప్రకాష్‌రెడ్డి అక్రమాల మీద హౌసింగ్ అధికారులు ఒక నివేదిక సిద్ధం చేశారని, దాన్ని బయటకు రానివ్వకుండా అధికారం అండతో తొక్కిపెట్టారని అన్నారు. ఆ నివేదికను తీసుకుంటే రాక్రీట్ అక్రమాలు పూర్తిస్థాయిలో బయటకొస్తాయని అన్నారు. ప్రకాష్‌రెడ్డి అక్రమాలు అక్కడితో ఆగ లేదని... ఇళ్లను నిర్మించేందుకు వేరే రాష్ట్రం నుంచి వచ్చిన సబ్ కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా బెదిరించి, వారి కార్మికులను బంధించిన ఘనచరిత్ర ఆయనకే దక్కుతుందని విమర్శించారు. లబ్ధిదారుల జాబితా తీసుకుని, వారికి ఇళ్లు దక్కాయా లేదా అని పరిశీలించాలని కోరారు. ఈ అవినీతి అక్రమాల కారణంగా ఆరేళ్లుగా పేదల సొంతింటి కల నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి, మంత్రికి ఆమె విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి కృష్ణాజలాల బంద్


రెగ్యులేటర్ నుంచి రిజర్వాయర్‌కు చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాలు సరఫరా శనివారంతో ముగియనున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి కోసం శ్రీశైలం జలాశయం నుంచి మిగులు జలాలు 40 టీఎంసీలు హంద్రీనీవా పథకం నుంచి చేరాల్సి వుంది. హంద్రీనీవా అధికారులు తెలిపిన మేరకు.. కృష్ణా జలాలను గత యేడాది ఆగస్టు 8వ తేదీ నుంచి విడుదల చేశారు. హంద్రీనీవా పథకం ఫేజ్-1 మెయిన్ కెనాల్ నుంచి జీడిపల్లి రిజర్వాయరుకు 16.223 టీఎంసీలు తరలించారు. ఈ సీజన్‌లో జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కెనాల్‌కు 11.862 టీఎంసీలు విడుదల చేశారు. పీఏబీఆర్‌కు 2.146 టీఎంసీలు మండలంలోని శీర్పి, బెళుగుప్ప చెరువులకు పంపుహౌస్ నుంచి 0.519 టీఎంసీలు విడుదల చేశారు. జీడిపల్లి రిజర్వాయరు నుంచి ఔట్‌ఫ్లో 14.437 టీఎంసీ వెళ్లిందని అధికారులు వెల్లడించారు.

130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాల 130 క్యూసెక్కులు వస్తున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 402 క్యూసెక్కులు వెళుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.526 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్‌లో త్వరలో నిర్వహించే మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, నేటివిటీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతపరచాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులను నగరంలోని బీసీస్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయడం, అభ్యర్థులు పూరించిన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. వివరాలకు 08554-275575 నంబరులో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

లోకేశ్‌ను విమర్శిస్తే ఊరుకోం

టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ



పుట్టపర్తి రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారాలోకేశ్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అంబటి రాంబాబును హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో విద్యాశాఖను నిర్వీర్యం చేశారని, నేడు విద్యాశాఖలో ఆధునిక విప్లవం తీసుకొస్తున్న మంత్రి నారాలోకేశ్‌ను విమర్శిస్తే సహించబోమన్నారు. అంబటి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన 9నెలల్లోనే ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. మరోసారి వాగితే తగిన రీతిలో బుద్దిచెప్పాల్సి వస్తుందన్నారు.

10న కలెక్టరేట్ ముట్టడి

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ... హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తూ అన్ని చెరువులకు నీటిసరఫరా చేయాలని, కరెంటు ఒకేసారి పగలు ఇవ్వాలని, స్మార్ట్‌మీటర్లు బిగించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఎల్ ఆదినారాయణ పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల బాధ్యత ఆర్పీలకు తగదు

కదిరిఅర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఇంటి, నీటి పన్ను వసూళ్లు చేయాలని డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన రీసోర్సు పర్సన్లను ఆదేశించడం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. రీసోర్సు పర్సన్లు ఇంటి, నీటి పన్నులు వసూలు చేయాలని, లేకపోతే విధుల నుంచి తొలగిస్తామని మున్సిపల్ అధికారులు బెదిరించడం సరికాదన్నారు. పన్నులు వసూలు చేయడానికి ప్రత్యేక విభాగముందని, వారితో ఆ పనులు చేయించాలే తప్ప, ఆర్పీలపై ఒత్తిడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్పీలు ఒకవైపు రాజకీయ నాయకుల.. మరోవైపు అధికారుల వేధింపులతో సతమతమవుతున్నారన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ, ఈబీసీ, బలిజ కులాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 18 నుంచి 50 సంవత్సరాల మహిళలు అర్హులని, ఓబీఎంఎంఎస్ లాగిన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ముదిగుబ్బ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు కనుమ ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వమే ఉందని, ఇప్పటికైనా వాల్మీకి బోయ కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేశారు.

రాయితీతో గడ్డి విత్తనాలు

బత్తలపల్లి మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులకు రాయితీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తామని ఏడీ శ్రీనివాసులు, పశు వైద్యాధికారి గురునాథ్‌రెడ్డి తెలిపారు. వేసవి కాలంలో పాడిపశువులకు పచ్చిగడ్డి కొరత ఏర్పడే పరిస్థితి ఉందని, కావున పాడి రైతులకు బోరుబావుల క్రింద గడ్డి విత్తనాలు సాగు చేసుకోవాలని సూచించారు.పాడిరైతులను ఆదుకోవడంలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీతో ఆ విత్తనాలను అందిస్తోందని, సబ్సిడీ పోను కిలో రూ. 23 చొప్పున అందిస్తామని అన్నారు. ఆసక్తిగల వారు బత్తలపల్లి, డి చెర్లోపల్లి పశువైద్యశాలలను సంప్రదించాలన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రవినాయక్

నల్లచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా రవినాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రవికుమార్ సెలవుపై వెళ్లడంతో, ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవినాయక్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా రవికుమార్‌రెడ్డి

నల్లచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా తనను ఎంపిక చేసినట్లు మండ్యెం రవికుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలో అసమ్మతి నాయకులను కలుపుకుని, మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

కదిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం రైతులు పంటరుణాలను రెన్యువల్ చేసుకోవాలని సైదాపురం సొసైటీ సీఈఓ హనుమంతురెడ్డి శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. రైతులు ఈనెల 20లోపు తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

కదిరి, మార్చి7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక తన నివాసంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఇంతవరకు ఆ పథకాలను అమలు చేయలేదన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని విమర్శించారు.

పాఠశాలకు స్పీకర్ల వితరణ

నల్లమాడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఆస్ట్రేలియాకు చెందిన సత్యసాయి భక్తులు రూ. 10 వేల విలువైన సౌండ్ స్పీకర్లు విరాళంగా ఇచ్చారు. వాటిని హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డికి స్థానికుడు షామీర్ శుక్రవారం అందచేశారు. పాఠశాలలో సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి.. భక్తిగీతాలు ఆలపించి, భజనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వేమనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మోహన్, అక్బర్, నరసింహరావు, అరుణ, రాధిక ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు

బుక్కపట్నం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో డైట్ విద్యార్థులకు త్వరలో మండల కేంద్రంలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. దీంతో ఇందు కోసం బుక్కపట్నం డిగ్రీకళాశాల మైదానాన్ని శుభ్రం చేసే పనులను శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ నాగలక్ష్మిరాజు, అధికారులు ఎక్స్‌కవేటర్‌తో మైదానాన్ని శుభ్రం, చదును చేసే కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి సాధిక్‌వలీ, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రమేష్ ఉన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

నల్లచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట మండలాల క్లస్టర్ సమావేశాన్ని పీడీ విజయేంద్రప్రసాద్ శుక్రవారం నిర్వహించారు. ప్రతి పంచాయతీ నుంచి ఈనెల 31లోపు మండలంలో రైతు పొలాల్లో పది ఇంకుడు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు వెయ్యి, కంపోస్టు ఎరువు గుంతలు వెయ్యి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రమేష్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఇంజనీర్లు హరిబాబు, బాలునాయక్, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, ఏపీఓలు పాల్గొన్నారు.



డ్రైనేజీపై శ్లాబ్ తొలగించిన దృశ్యం

పట్టించుకోరా..?

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవనగర్‌లో బలిజ కల్యాణ మండపం సమీపంలో మున్సిపల్ కార్మికులు డ్రైనేజీపై శ్లాబును తీసి.. కాలువలో చెత్తను తొలగించారు. అనంతరం దాన్ని మూసి వేయకుండా నిర్లక్ష్యంగా అలాగే వదిలేసి వెళ్లారు. ఈ రహదారి నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, పాదచారులతో రద్దీగా ఉంటుంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు వెళ్తుంటారు. వారు ఏ మాత్రం ఆదమరచినా ప్రమాదం తప్పదు. ఇప్పటికే చాలా మంది ద్విచక్రవాహనదారులు, పాదచారులు అందులో పడి గాయపడ్డారు. ఈ పరిస్థితిని నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు చూస్తూ వెళ్తున్నారే తప్పా.. మాకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఏదైనా ప్రాణాపాయం జరిగితే తప్పా స్పందించరా అని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీపై స్లాబు వేయాలని కోరుతున్నారు.

శ్మశానంలో తొలగిన సమస్య

ముదిగుబ్బ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్మశానంలో సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. సీసీ రోడ్డు వేయించాలని గత వైసీపీ పాలనలో పాలకులను, అధికారులను ముస్లింలు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 150 మీటర్ల సిమెంటు నిర్మాణానికి రూ. 7.46 లక్షలను మంజూరు చేసింది. దీంతో ఆ పనులను కూడా వెంటనే చేపట్టారు. సీసీ రోడ్డు ఏర్పాటుతో శ్మశానంలో రహదారి సమస్య పరిష్కారమైంది. దీనిపై ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు .. నేడు



గతంలో ముస్లింల శ్మశానంలోని రోడ్డు (ఫైల్)



ప్రస్తుత రోడ్డు

ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆర్డీఓలు కిందిస్థాయి సిబ్బందిపై ఆధారపడకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గాల అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి రాబోవు ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గాల అభివృద్ధిపై పూర్తి స్థాయిలో ప్రణాళికలు తయారు చేసి అందించాలన్నారు. జిల్లాలో సోలార్‌పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాలు, పారిశ్రామిక, టూరిజం, అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, డీఈఓ క్రిష్టప్ప, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీమోహన్, ఎండోమెంట్ అధికారి నరసింహరాజు, టూరిజం అధికారి జయశంకర్ పాల్గొన్నారు.



ఆర్డీఓలతో మాట్లాడుతున్న కలెక్టర్



కేక్‌కట్ చేస్తున్న ఎస్పీ, సిబ్బంది

కలిసి పనిచేద్దాం.. ప్రగతిని సాధిద్దాం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అందరం కలసికట్టుగా పనిచేసి జిల్లాలో ప్రగతిని సాదిద్దామని ఎస్పీ వీ రత్న పిలుపినిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాన్ఫరెన్సు హాల్లో సిబ్బందితో కలసి కేక్‌కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మహిళా సిబ్బందికి, మహిళకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరెంటెండెంట్ సరస్వతి, డీపీఓ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

కదిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక యుగంలో మహిళలు రంగాల్లో పట్టు సాధించి.. రాణించాలని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కదిరి ప్రాజెక్టులో మహిళ దినోత్సవాన్ని పురష్కరించుకొని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమాజమైతే మహిళను ఉన్నతంగా చూస్తుందో ఆ సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, ఎంఈఓ చెన్నక్రిష్ణ, కౌన్సిలర్ శివలత, ప్రముఖ న్యాయవాది నరసింహులు, సమత సంస్థ ప్రతినిధులు వెంకటేష్, శ్రీనివాసులనాయుడు, బాబ్‌జాన్, ఉమాశంకర్‌రెడ్డి, మౌనిక, మనోహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

తాడిమర్రి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారసింపల్లి గ్రామంలోని జేవీఎం ఆర్డీటీ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాఠశాల వ్యవస్థాపకుడు, మాజీ డీజీపీ జేవీరాముడు, రిటైర్ట్ లెఫ్టినెంట్ జనరల్ మోహన్, కాకతీయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు లోక్‌నాథ్, గూడూరు సత్యనారాయణ, గీతామోహన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణపై కూడా శ్రద్ధ పెట్టాలన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సింధుకు రూ.20, యామనికి రూ.15వేలు, మేఘనకు రూ.10వేలు, చంద్రశేఖర్‌కు రూ.10వేలు, స్పందన రూ.10వేలు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరి, ఎస్‌ఎంబాషా పాల్గొన్నారు.

నాటుసారాను నియంత్రించాలి

నంబులపూలకుంట, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : మండలంలో నాటుసారా తయారీని నియంత్రించడానికి అందరూ సహకరించాలని ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈకార్యక్రమంలో ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఎస్ఐ వలీబాషా, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్, విఆర్ఓలు, ప్రజలు, సిబ్బంది ఉన్నారు.

● గాండ్లపెంట : నాటుసారా నిర్మూలనపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నాటుసారా తయారుచేయడం, విక్రయించడంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఇందులో తహసీల్దార్ బాబురావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అడిగేవారు ఎవరు..?

11 గంటలైనా విధులకు రాని స్టాంప్ ఇన్‌చార్జి



కదిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిష్టర్ కార్యాలయంలో పనిచేసే స్టాంపుల ఇన్‌ఛార్జి మధు శుక్రవారం ఉదయం 11గంటలైనా విధులకు రాలేదు. స్టాంపుల కోసం ప్రజలు వేచి వేచి.. ఇక చేసేదిలేక ఉసూరుమంటూ వెళ్లిపోయారు. దీనిపై సబ్‌రిజిష్టర్ ఫణికుమార్‌ను వివరణ కోరగా.. అతను హిందూపురం నుంచి రావల్సి ఉందని, రోడ్డు సరిగా లేకపోవడంతో ఆలస్యంగా వస్తారని సమాధానమించారు.

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన డీఎస్ఓ



తిమ్మమ్మమర్రిమాను వద్ద డీఎస్ఓ, కుటుంబ సభ్యులు

నంబులపూలకుంట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటిబైలు గ్రామంలో తిమ్మమ్మ మర్రిమానును డీఎస్ఓ (జిల్లా పౌరసరఫరాల అధికారి) వంశీక్రిష్ణరెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం సందర్శించారు. తిమ్మమ్మ బాలవీరయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. మర్రిమాను చరిత్రను గైడ్ మనోహర్ వివరించారు. ఆయన వెంట సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యుడు వెంకటనారాయణ, డీలర్లు, లక్ష్మినారాయణరెడ్డి, నారాయణస్వామి, బీజేపీ నాయకుడు జయరాం ఉన్నారు.

దళితుల శశ్మానవాటిక కబ్జా



మాట్లాడుతున్న మాలమహానాడు సంఘం నాయకులు

ధర్మవరంరూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో సర్వేనెంబర్ 94లో వంకపోరంబోకు భూమిలో 89 సెంట్లు ఉన్న దళితుల శశ్మానవాటిక ను కబ్జా చేశారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు, సమతా సైనిక్ జిల్లా అధ్యక్షుడు సుగుమంచి శ్రీనివాసులు వాపోయారు. శుక్రవారం ఆర్డీఓ మహేష్‌కు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. 60 సంవత్సరాలుగా మాల కులస్థులను ఆ స్థ లంలో ఖననం చేసేవారని, అయితే అదే గ్రామానికి చెందిన అమర నారాయణ ఆ స్థలాన్ని కబ్జా చేశారని అన్నారు. అధికారులు స్పందించి ఆ స్థలాన్ని దళితుల శ్మశానవాటికకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

బుక్కపట్నం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 65 మందికి రూ. 30 వేల విలువ చేసే విద్యా సామగ్రిని పుట్టపర్తికి చెందిన ఖిత్‌మత్ ఏక్‌కల్క్ చార్టబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. సత్యసాయి బాబా సేవా స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేస్తున్నట్లు వారు చెప్పారు. ఇందులో ఆ సొసైటీ ప్రెసిడెంట్ షామీర్, ఉపాధ్యాయులు మాణిక్యం ఇషాక్, నాగరాజు, ట్రస్టు సభ్యులు షాకీర్, మహమ్మద్‌అలీ, సాధిక్, హన్ను పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల పరిశీలన

కదిరిఅర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లి స్పెస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలను ఆర్డీఓ వీవీఎస్ శర్మ శుక్రవారం పరిశీలించారు. మాస్‌కాపింగ్ జరగకుండా జాగ్రత్త పాటించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

క్రైం న్యూస్..

యువకుడి ఆత్మహత్య



చక్రవర్తి మృతదేహం

ధర్మవరం రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లిలో బాలగాని చక్రవర్తి(32) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చక్రవర్తికి బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన చంద్రకళతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరు ఇద్దరు బెంగుళూరులోని నివాసముంటున్నారు. చక్రవర్తి మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మూడు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన చక్రవర్తి కడుపు నొప్పి తాళలేక శుక్రవారం తెల్లవారజామున ఇంటిలో ఫ్యాన్‌కొక్కికి ఉరివేసుకుని ఆ త్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూడగా అప్పటికే అతను మరణించినట్లు గుర్తించారు. రూ రల్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చక్రవర్తి తండ్రి బాలగాని నరసింహుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చోరీ కేసుల్లో మూడేళ్ల జైలు శిక్ష

పుట్టపర్తి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లల్లో చోరీకి పాల్పడిన కేసుల్లో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన అమర్నాథనాయుడు బుక్కపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. రెండు కేసులకు సంబంధించి ఏసీపీ రాజేంద్రప్రసాద్, బుక్కపట్నం పోలీసులు సాక్ష్యాలతో ఆ నేరాలను నిరూపించారు. దీంతో అమర్నాథనాయుడుకు మూడేళ్ల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 15 రోజులు జైలుశిక్ష అనుభవించాలని న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

బాలుడి అదృశ్యం



మహవీర

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు మహవీర కని పించడం లేదని స్థానిక గాంధీనగర్‌కు చెందిన మలిశగన్‌లాల్ వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. మహవీర స్థానిక ఓ ప్రైవేటు స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడని, శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఇంటి నుంచి కాలేజ్ గ్రౌండ్‌కి వెళ్లాడని, తిరిగి ఇంటికి రాలేదని వాపోయాడు. అతని కోసం బంధువులు, తెలిసిన వాళ్లలో గాలించామని, అయినా ఆచూకీ లభించలేదని అన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాలుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

తొమ్మిది తులాల నగలు చోరీ

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో నివాసముంటున్న శివ.. కేతిరెడ్డికాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం శివ ఇంటికి తాళాలు వేసి స్కూల్‌కు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిపై నుంచి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన శివ... ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నమూనాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

అలరించిన రోబోటిక్ నమూనాలు

ముదిగుబ్బ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీఎస్ పాఠశాలలో విద్యార్థులు రోబోటిక్ నమూనాలను శుక్రవారం ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, సామర్థ్యాలను వెలికితీసే ఉద్దేశంతో మొదటిసారిగా రోబోటిక్ శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటమా..!

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇలా బొలెరో వాహనంలో భారీ విద్యుత్ స్తంభాలను తరలిస్తుండటంతో ఇతర వాహనదారులు, స్థానికులు హడలిపోతున్నారు. పొరపాటున ఆ విద్యుత్ స్తంభాలు జారీ పడితే .. వాటి వెనక వచ్చే వాహనదారుల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. బొలెరో వాహనం మలుపు వద్ద డ్రైవర్ ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా... ఇతర వాహనదారులు ప్రమాదానికి గురికావాల్సిందే. ఇలాంటి వాటిపై ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బొలెరోలో తరలిస్తున్న విద్యుత్ స్తంభాలు

న్యూస్ బాక్స్

నీటి సమస్య పరిష్కరించండి

కమిషనర్‌కు ఇందిరమ్మ కాలనీవాసుల వినతి



వినతిపత్రం అందిస్తున్న తిమ్మాపురం కాలనీవాసులు

పెనుకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని రెండోవార్డు తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో సుమారు 250 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. నీటిసమస్య నెలకొనడంతో వాటర్‌ట్యాంకుల ద్వారా నీటి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని చర్యలు తీసుకోవాలని కోరారు. వారం పది రోజుల్లో సమస్య పరిష్కరస్తానని, అంతవరకు వాటర్‌ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రమేష్, సీపీఎం నాయకులు హరి, కాలనీవాసులు రేష్మ, సుజాత, షబీనమ్మ, మంజు, మణెమ్మ పాల్గొన్నారు.

రాయచోటి ఘటనను ఖండిస్తున్నాం

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణప్ప



మాట్లాడుతున్న రామకృష్ణప్ప

పెనుకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయకులు పేర్కొన్నారు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. కాశీవిశ్వేశ్వర ఆలయంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణప్ప శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం జరుగుతున్న సమయంలో అన్యమతస్థులు కొందరు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలపై రాళ్లు రువ్వడం అమానుషమన్నారు. గతంలో అదేప్రాంతంలో అయ్యప్పస్వామి భక్తులపైన కూడా ఇలానే దాడి జరిగిందన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. ఈనెల 10న కలెక్టరేట్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. 20వతేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు గోశాయి హరిప్రసాద్ వేదవ్యాస్, సాయిప్రసాద్, మారుతిరెడ్డి, నవీన్, కేదరినాథ్, రమేష్, కళ్యాణచక్రవర్తి, ఉత్తేజ్‌క్రిష్ణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలి

కార్మిక సంఘం నాయకుడు రవికుమార్ డిమాండ్



అధికారికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

హిందూపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ఉస్వేల్‌స్వెల్టర్స్ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘం నాయకుడు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇంటి అద్దెలు కట్టకపోవడంతో యజమానుల నుంచి కార్మికులకు తీవ్ర ఒత్తిడి ఎదురవుతోందన్నారు. పరిశ్రమ యాజమాన్యం వెంటనే స్పందించి జీతాలు ఇవ్వాలని లేనిపక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పోషకాహారంతో పెరగనున్న హిమోగ్లోబిన్

వైద్యురాలు శ్రీదేవి

హిందూపురం అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకోవడంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని వైద్యురాలు శ్రీదేవి పేర్కొన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రగతి ఆధ్వర్యంలో కళాశాల జంతు శాస్త్ర విభాగం, రెడిరిబ్బన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉండాలంటే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. సాధారణంగా రక్తంలో 12 శాతం నుంచి 16 శాతం వరకు హెచ్‌బీ ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ అమరేష్, జంతు శాస్త్ర విభాగం అధ్యాపకురాలు జమీలా, కౌశర్ పాల్గొన్నారు.

పుల్ల శనగ సాగులో ఉత్తమ రకాలు వాడాలి

అగ్రి డైరెక్టర్ డిల్లీరావు

అమరావతి, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పుల్ల శనగ సాగులో జేజీ-11కు ప్రత్యామ్నాయ రకాలను ఎంపిక చేసుకుని, యంత్రాలతో కోతలు, నూర్పిడి చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు రైతులకు సూచించారు. పుల్లశనగ సాగులో ఎండు తెగులు తట్టుకునే రకాలతో పాటు యంత్రాలతో కోతకు అనువైన రకాలపై రైతులకు అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం పుల్లశనగ సాగులో నూతన ఆవిష్కరణలపై ఆయన రైతు ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పుల్లశనగలో ప్రధాని మోదీ ఆవిష్కరించిన ఎన్‌బీఈజీ-1267 రకం ఉత్తమమైందని, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో రబీ సీజన్‌కు అనువైందని చెప్పారు. అలాగే నంద్యాల రకాలు 47, 49, 452, 776, 857 అనుకూలమైనవని వివరించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మహిళల 2కే రన్‌లో నాయకులు, అధికారులు

హిందూపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాయకులు, అధికారులు సూచించారు. సృష్టికి మూలం స్త్రీ అని కొనియాడారు. ప్రతి బిడ్డకు మొదటివ గురువు అమ్మ అని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో 2కే రన్‌ను మెప్మా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గురునాథ్ సర్కిల్‌లో మునిసిపల్ చైర్మన్ రమేష్, మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, డీఎస్పీ మహేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్ 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు చట్టాలను తీసుకువచ్చాయన్నారు. మహిళలు, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, సీడీపీఓ శాంతి, మెప్మా అధికారి గంగులయ్య, కౌన్సిలర్లు రాఘవేంద్ర, మంజుళ, సునీత, సతీష్ నాగమణి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్, ప్రజాప్రతినిధులు, అధికారులు

విద్యతోనే మహిళల అభివృద్ధి: సీడీపీఓ



గోరంట్ల పాఠశాలలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి

గోరంట్ల, మార్చి7(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని సీడీపీఓ రాజేశ్వరి సూచించారు. గోరంట్లలోని బాలికల, బూదిలి ఉన్నతపాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలమన్న భావనను విడనాడాలన్నారు. అభివృద్ధివైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల సమానత్వం కోసం పాటుపడాలన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోరంట్ల పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీ, 1, 4, అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పౌష్టికాహారం పంపిణీ, కేంద్ర నిర్వహణ తదితర విషయాలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న అతిథులు

హిందూపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మునిసిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాక్షించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ శాంతి, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, సీఐలు జనార్దన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో...

మడకశిరటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని కమిషనర్ రంగస్వామి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మెప్మా ఆధ్వర్యంలో అనేక మంది మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నజీర్, టీపీఓ సునీల్‌రాజు, ఏఈ మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రంగస్వామి



ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన సునీత

ఆదుకోండి..

రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఎదుట ఓ మహిళ వేడుకోలు

పావగడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తాను, నలుగురు పిల్లలు పాతమిద్దెలో నివాసముంటున్నామని, అది ఎప్పుడైనా కూలవచ్చని, తనకు ఇల్లు నిర్మించి ఆదుకోవాలని ఓ మహిళ అధికారులను వేడుకుంది. వీరంపల్లి గ్రామానికి చెందిన సునీత శుక్రవారం రెవెన్యూ, పంచాయత అధికారుల ఎదుట తన దీనస్థితిని వెల్లబోసుకుంది. భర్తను కోల్పోయి నలుగురు పిల్లలతో తాను జీవనం సాగిస్తున్నానంటూ తెలిపింది. రేషన్‌కార్డు తనకు లేదని, ఇవ్వాలని ఎన్నిసార్లు అర్జీ పెట్టుకున్నా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసింది. వితంతు పింఛన్ కోసం అధికారులను వేడుకున్నానని, కరుణించలేదని గోడు వెల్లబోసింది. కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తనకు రేషన్‌కార్డు, వితంతు పింఛన్ ఇవ్వాలని కోరింది. సునీతకు వెంటనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, రేషన్‌కార్డు, వితంతుపింఛన్ మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

పంట నమోదులో నిర్లక్ష్యం వద్దు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

చిలమత్తూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రబీలో చేపట్టిన పంటనమోదులో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దేమకేతేపల్లి, మొరసలపల్లి, సోముఘట్ట గ్రామాల్లో ఎంపిక చేసిన పంట నమోదును ఆయన పరిశీలించారు. గతంలో స్థానిక వ్యవసాయాధికారులు చేపట్టిన ఈ-క్రాప్ బుకింగ్‌ని తనిఖీ చేసి సంబంధిత రైతులతో మాట్లాడారు. దేమకతేపల్లిలోని సర్వేనంబర్ 2405లో రైతు వేణుగోపాల్‌తో, మొరసనపల్లిలో సర్వేనంబర్ 259-4లో రైతు శ్రీనివాసరెడ్డితో, సోమఘట్టలో సర్వేనంబర్ 46-1లో రైతు వెంకటరెడ్డితో మాట్లాడి వారు సాగుచేసిన పంటలను పరిశీలించారు. పంటల వివరాలను, సాగైన విస్తీర్ణం ఎంత? తదితర విషయాలను తనిఖీ చేశారు. అనంతరం కానుగమాకులపల్లిలో రీసర్వే పనులను పరిశీలించారు. జేసీ వెంట వ్యవసాయ శాఖ ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్, చిలమత్తూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేశులు, ఏఓ వంశీకృష్ణ, మండల సర్వేయర్ కోదండపాణి తదితరలు పాల్గొన్నారు.



దేమకేతేపల్లిలో రైతులతో మాట్లాడుతున్న జేసీ

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ శుక్రవారం క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించారు. తిప్పరాజుపల్లిలో సర్వేనెంబర్ 558లోని రైతు నరసింహారెడ్డి పొలానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఆయనతోపాటు తహసీల్దార్ మారుతి, హిందూపురం అగ్రికల్చర్ ఏడి అల్తార్‌అలీఖాన్, ఇన్‌చార్జి ఏఓ వంశీకృష్ణ, వీఆర్‌ఓ లక్ష్మీనారాయణ ఉన్నారు.

అవగాహన కల్పించండి

పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): ప్రజల చూపు జనరిక్ మందులవైపు వచ్చేలా అవగాహన కల్పించాలని జేసీ అభిషేక్ కుమార్ సూచించారు. శుక్రవారం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి భారతీయ జనఔషధ ప్రయోజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకే మందులు జనరిక్ ఔషధ కేంద్రంలో దొరుకుతాయన్నారు. మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, ఆనంద్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మోహన్‌నాయక్, డాక్టర్ సెల్వీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం



నీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

మడకశిర రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలోని తాగునీటి ట్యాంకులను అధికారులు శుక్రవారం శుభ్రంచేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో దిష్టి ట్యాంకులు శీర్షికకు పంచాయతీ అధికారులు స్పందించారు. కల్లుమర్రి పంచాయతీ కార్యదర్శి వరదరాజులు శుక్రవారం పంచాయతీ సిబ్బందితో వెళ్లి గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకులు శుభ్రం చేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రొళ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యాసంవత్సరానికి 5వతరగతికి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మార్చి 6 వరకు గతంలో దరఖాస్తు చేసుకునేందుకు వీలుకల్పించామని, దానిని ప్రస్తుతం 13వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు: సీఐ

మడకశిర రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చదువుతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని సీఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. ఎంఈఓలు భాస్కర్, నరసంహులు ఆధ్వర్యంలో శుక్రవారం గుండుమల గురుకుల పాఠశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బహుమతుల ప్రదానం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఐ రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రసాగర్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు తప్పిన ప్రమాదం

అమరాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకులకు పెనుప్రమాదం తప్పింది. వివరాల మేరకు పని నిమిత్తం మడకశిరకు వెళ్లి తిరుగుప్రయాణంలో స్టీల్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే కారు ముందుభాగాన టైర్లు పగలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారులో తెలుగుదేశం పార్టీ నాయకులు గణేష్, ఆల్‌గుండేగౌడ్, జయప్ప, నింగేగౌడ్ ప్రయాణిస్తున్నారు. వారిలో ఆల్‌గుండేగౌడ్ తలకు స్వల్ప గాయమైంది. సమాచారం అందుకున్న ఏఎ్‌సఐ రామాంజినేయలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, నాయకులు మారుతీప్రసాద్ తదితరులు వారిని పరామర్శించారు.

పెనుకొండ కొండకు నిప్పు

పెనుకొండ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెనుకొండ కొండకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వేలాది మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. బీజేవీపీఎస్ సభ్యులు భోగసముద్రం జలవనసంరక్షణ సభ్యులు మంటలు ఆర్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫైర్ సిబ్బంది వచ్చి తమవంతుగా ప్రయత్నంచేశారు.



కాలిపోతున్న పెనుకొండ కొండ

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): లేపాక్షి దుర్గా వీరభద్ర, పాపనాశేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు అధిక సంఖ్యలో విచ్చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా గోపుర కలశ అంకురార్పణ



అలంకరణలో స్వామివారు

మడకశిరటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోపుల కలశ అంకురార్పణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. ఉదయం 9 గంటల నుంచి శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన, వసుదేవ పుణ్యాహవాచనం, వాస్తుహోమం, సాయంత్రం వాసుదేవ పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పరిగి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెన్నానది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు వీఆర్‌ఓ శ్రీనివాస తెలిపారు. రొద్దం మండలం మరువపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో వెళ్లి పట్టుకోవడం జరిగిందన్నారు. ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్ వద్ద ఉంచినట్లు వివరించారు. కాగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందని, వెంటనే అడ్డుకట్ట వేయాలని పైడేటి గ్రామస్థులు కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

అగళి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం టెన్నిస్‌బాల్ క్రికెట్ లీగ్-2 టోర్నమెంట్‌ను జడ్పీటీసీ ఉమేష్ ప్రారంభించారు. మూడు రోజులపాటు టోర్నమెంట్ నిర్వహణ ఉంటుందని నిర్వాహకులు గోవిందరాజులు, రవి తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు, ఎంపీటీసీ నాగోజీ, వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొడ్డరంగేగౌడ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

అగళి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సీసీరోడ్ల నిర్మాణానికి రూ.34లక్షల నిధులు మంజూరైనట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. ఆర్‌జిపల్లి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, నరసాంబుదిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4లక్షలు, మధూడికి రూ.5లక్షలు ఆలూడి రూ.5లక్షలు, ఇరిగేపల్లి రూ.5లక్షలు, ముత్తేపల్లి రూ.5లక్షలు, డొక్కలపల్లి, వడ్రహట్టి సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరైనట్లు వివరించారు. త్వరలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు.